

వార్తా వాహుడు

పురాణం సూర్య ప్రకాశరావు

ముందు పెరట్లో ఎఱ్ఱగన్నేరు గోడ మీంచి ఒరిగి పచ్చని ఆకులతో ఎఱ్ఱగా చూస్తూంది.

ఎండ చురుగ్గా వుంది.

గుమ్మంవారాగా, చల్లని పంచతో వెచ్చగా కూర్చుని పత్రిక తిరగవేస్తూ లోపలి మాటలు వింటూంది శకుంతల.

పొయ్యిముందు ఎఱ్ఱని మంట ఎదురుగ్గా కూర్చున్న తల్లితో గోపాలం చెబుతున్నాడు.

"వాళ్ళు చెల్లాయి శకుంతలని చూడ్డానికి వస్తామన్నారు.

శకుంతల మనస్సు ఎఱ్ఱగన్నేరు పూలగుత్తిలా ఊగిపోయింది.

''ఇది గనక కుదిరిందా ఇక నాకు దిగులులేదు. దాని ఈడు వాళ్ళందరూ పెళ్ళిళ్ళయి పిల్లాపాపాతో కాపరాలు చేసుకుంటున్నారు," అంది తల్లి.

"అలా వాళ్ళు కొండెక్కి కూర్చుంటే మటుకు కష్టం! కాస్తన్నా దిగితే పెళ్ళి ఖర్చుకు సరిపడుతుంది," అన్నాడు గోపాలం.

"కాదూ కూడదంటే కాస్తకి

లోభిత్వంచేసి సంబంధం ఒదులు కుంటామా," అంది తల్లి

"మరీ పట్టుబడితే చేసేది లేదనుకో. నువ్వు మాత్రం వాళ్ళదగ్గర తొందర పడకు," అన్నాడు గోపాలం

తల్లి సంబరపడిపోయింది.

గోపాలం పంచలోకి వచ్చి చెల్లితో వరాచికమాడాడు. "పోస్టుమాన్ పెళ్ళి కొడుకు రేపు వచ్చి చూస్తాడు. ఇవ్వాళే కంటబడేవ్" అంటూ.

శకుంతల చేతిలో పుస్తకం ముఖం మీదికంటూ లాక్కుని మనస్సులో ఉవ్వెత్తుగా లేచిన ఆనందాన్ని పెదాల మీదికి, కళ్ళల్లోకి తెచ్చుకుని మురిసి పోయింది.

వీధి మొగలో సైకిలు బెల్లు మోగింది!

ఆమె శరీరం ఆపాదమస్తకం విద్యుత్తు పాకినట్టుగా ఝల్లుమంది. ముఖంమీంచి పుస్తకం తప్పించి గుమ్మం లోంచి వీధిలోకి చూసింది. ఆ సైకిలు ఇటు రాలేదు. 'ఎవరిదో' అనుకుంది.

"అమ్మాయ్... ఇలా వచ్చి అన్న య్యకు పీటవేసి కంచం పెట్టు. వాడికి వేళవుతూంది," అంటూ తల్లి పిల్చింది.

శకుంతలకు ఆ మాటలు ఎక్కడో దూరాన్నుంచి వినపడ్డట్టుగా వినిపించాయి.

"అమ్మ పిలుస్తూంది. అప్పుడే ధ్యాస ఎక్కడికో పోయినట్టుంది" అన్నాడు గోపాలం మళ్ళీ.

పుస్తకం మూసి లోపలికి వెళ్ళింది శకుంతల. పీట వేసి కంచం పెట్టి మంచి నీళ్ళ గ్లాసుని పీటవారగా వుంచింది. తల్లి వడ్డించింది. గోపాలంవచ్చి కూర్చున్నాడు.

శకుంతల అక్కడ వుండకుండా ఇవతలకు వచ్చేసింది. మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకుంది. పంచలోకి వచ్చి కూర్చుంది. తీరా వచ్చి కూర్చున్న తర్వాత సిగ్గుతో వాళ్ళకు దూరంగా తప్పుకున్నా అతగాడి ఎదట ఇప్పుడే పడాల్సి వస్తుందేమోనని అనిపించి ఆమె ముడుచుకుపోయింది. అతడు ఇటుగానే వెళ్తాడు ఉత్తరాలంటూ వుంటే లోపలికి వస్తాడు. లేకుంటే అలాగే వెళ్ళిపోతాడు. ఉత్తరాలు రోజూ ఏమి వుంటాయి? అతని గొంతు విని పిస్తే ఉత్సాహంగా పంచలోకి పరుగెత్తుకు వచ్చేది. ఈ సంవత్సరం పొడుగూతా అతనెన్నో ఉత్తరాలు తెచ్చి ఇచ్చాడు. సంతోషాన్ని మోసుకొచ్చాడు. విచారాన్నీ మోసుకొచ్చాడు. అసలు అతనే ఒక ఆకర్షణ. అతను వచ్చే వేళ కోసరం ఎందరు ఎదురు చూస్తారు! ఎన్నెన్నో ఆశలు! ఎన్నెన్నో శుభవార్తలు!! ఉద్యోగాల కోసరం... కలలు పండే పెళ్ళి వార్తల కోసరం!! అయిన వాళ్ళ క్షేమం కోసరం...!!

పద్మ ఓసారి "ఉత్తరం వచ్చింది" అంది ఎంతో సంబరంగా. ఆ ఉత్తరం ఏం మోసుకొచ్చిందో ఆమెకు ఏమిచ్చిందో పద్మ చూపుల్లోనే గ్రహించింది శకుంతల.

అయినా తెలియనట్టుగానే అడిగింది "ఎక్కడ్నించే," అని

"మావయ్య రాసారు... తర్వలో వస్తారుట."

"ఎందుకు ?"

"పోవే ... ఏమీ తెలియనట్టు ... ఎందుకొస్తారు ?"

"ఏమో...నాకేం తెలుసు ?"

ఆ సంవత్సరమే పద్మజకు బావతో పెళ్ళయిపోయింది.

కొన్నాళ్ళకి ఓనాడు...

"ఇవాళ ఉత్తరం వచ్చింది" అంది పద్మ.

"ఎవరి దగ్గర్నించి?"

"అక్కడ్నించే"

"అక్కడ్నించీ ఇక్కడ్నించీ అంటే నాకు అర్థంకావటంలేదు. ఎక్కడ్నించో స్పష్టంగా చెప్పాలి."

"నన్ను తీసుకు వెళ్తారుట."

"మీ బావవచ్చి ఎత్తుకుపోతాడంటావ్. పోతే పోవే...నువ్వేటుపోతేనా కెందుకు."

ఆ నెలలోనే పద్మ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

పిచుకలు పంచలోనూ, గోడమీదా, చెట్లమీదా రెక్కలల్లార్చుస్తూ, కిచకిచ మంటూ చిట్టి చిట్టి గంతులు వేస్తూ తిరుగుతున్నాయి. ఓ జంట వసారాలో గూడు అల్లుకుంటున్నాయి, పంచంతా వాటి తాలూకు గడ్డిపరకలూ, ఈకలు, దూది, గుడ్డపీలికలతో ఎన్నిసార్లు ఊడ్చి శుభ్రంచేసినా ఎప్పటికప్పుడు గత్తర బిత్తరగానే వుంటుంది.

ఓ రోజు పద్మతల్లి అమ్మతో అనడం విన్నది. "ఇవాళ అమ్మాయి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది... ఒంట్లో బాగో లేదట... అనుమానం..." అంటూను

గబగబా తను వాళ్ళ మధ్యకు వెళ్ళి కూర్చుంది.

ఆవిడ అదృష్టానికి తల్లి సంతోషి స్తూంటే ఆవిడ ముఖంమీద ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. అంతట్లో ధోరణి మార్చేసింది. "గంపెడు సంసారం.ఇంటినిండా పది తలకాయలు. అబ్బాయి మంచివాడయినా అమ్మాయి కష్టం తెలుసుకోలేక పోయాడు. చాకిరీతో పిల్ల నలిగిపోతూంది. అల్లరి పడకుండా తెలివిగా బయటపడమంటే అతగాడికి అర్థం కావటంలేదు. తనకి మాలిన ధర్మం ఎక్కడా వుండకూడదు. తన సంసారం ఎప్పుడూ ఇలాగే వుంటుందా? ఇవాళ ఒకరు రేపు ఇద్ద రవుతారు... ఈ పిల్లల గతేంకావాలి? తమ మంచి తాము చూసుకోవాలిగా? ఆడపిల్లలు పుడితే ఇట్టే ఎదిగి కూచుం టారు... పెళ్ళిళ్ళు చెయ్యాలి. పేరం టాలు చెయ్యాలి. వచ్చిందంతా ఈ మందిని మేపటానికే చాలకపోతే అప్ప టికి మిగిలేది అప్పులు, నెత్తికి చేతులు" అంటూను.

పద్మజ పురిటికి వచ్చింది. వచ్చిన రెండు నెలలకు బంగారంలాంటి కొడు కును కన్నది. వెళ్ళేముందు అన్నది "ఇన్నాళ్ళకు తెరిపిన పడ్డాను" అని.

"ఏం జరిగింది?"

"హాయిగా, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుందుకు అవకాశం చిక్కింది. ఇవాళ ఆయన దగ్గర్నించి ఉత్తరం వచ్చింది."

"అయితే ఇక్కడ కష్టాలు పడి పోతున్నావా?"

"అదికాదు... ఇకమీదట నేను... నా పాప... మా శ్రీవారూ వేరుగా ఆ లొగ్గిడిలోంచి బయటపడి వేరే కాపరం వుంటాం అన్నమాట," అంది పద్మ.

పద్మజ కలలు అలా విరగ బూసాయి.

ఓనాడు- గోపాలం, విసుగ్గా చిరాగ్గా వున్న ఓ రోజు - నిప్పులు చెరిగే ఓ వేసవి రోజు-

రాజు చేతిలో ఉత్తరాల కట్టతో పంచలోకి వచ్చి పిలిచాడు. తాను

ఉత్తరంకోసరం అతృతగా బయటకి వచ్చింది. ఉత్తరం చేతికిచ్చి, "ఇన్ని మంచి నీళ్లు ఇస్తారా?" అని అడిగాడు. తనకు జాలివేసింది. ఎండనిబడి తిరిగి తిరిగి బాగా అలసిపోయాడు. తెల్లని ఒళ్ళు కందిపోయింది. చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అవి ఆత్రంగా గుట గుటా త్రాగేసి "ఇంకో చెంబుడు నీళ్లు ఇవ్వండి" అని అడిగాడు. ఆ నీళ్ళతో ముఖం కడుక్కుని, చేతులు తడుపుకుని ఒళ్ళంతా జేబురుమాలుతో తుడుచుకుని ''ఇప్పుడు ప్రాణం హాయిగా వుంది. థాంక్స్.'' అని మళ్ళీ సెగలూ పొగలూ కక్కే ఎండలోకి వెళ్ళిపోయాడు,.. ఆ ఉత్తరం అలాంటి ఇలాంటి ఉత్తరంకాదు. అది అన్నయ్యకు తమ పేద సంసారానికి ఎంతో సంతుష్టి, పుష్టి ఇచ్చిన ఉత్తరం. అన్నయ్యకు ఉద్యోగం దొరికింది.

* * *

బైట మళ్ళీ సైకిలుగంట మోగింది. పుస్తకం పక్కకు వత్తిగించింది. సైకిలు ముందుచక్రం గుమ్మం ముందు కనిపించింది. చప్పున లేచి లోపలికి వచ్చేసింది శకుంతల.

రాజు లోపలికి వస్తున్నాడు.

శకుంతల కాళ్ళు దడదడ లాడాయి.

రాజు గుమ్మంలో నిలబడే "లోపలికి రావచ్చా?" అన్నాడు.

ఆ గొంతు విని గోపాలం వెనక్కి తిరిగాడు. "ఓహో మీరా...రండి... రండి,'' అని కుర్చీమీద తువ్వాలు తీసి దాన్ని గదిమధ్యనించి గోడవారకుచేర్చి ఆహ్వానించాడు.

తల్లి ఇవతలకు వచ్చి "ను వ్వా నాయనా" అంటూ పలకరించింది.

గోపాలం మంచం వాల్చుకు ని కూర్చున్నాడు

శకుంతల వంటగదిలో తలుపు వెనక్కి జేరింది

"మీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలని చొరవచేసి వచ్చాను" అన్నాడు రాజు.

"చెప్పండి," అన్నాడు గోపాలం.

"నిన్న మీరు నాన్నగారితో మాట్లాడుతూంటే విన్నాను. నా మీద మీకు ఆశ ఉన్నట్టుంది. అది సాధ్యపడదని చెప్పటానికి వచ్చాను."

"అంటే? మీ నాన్నగారు ఇష్టం లేదని చెప్పమన్నారా?" ఇంతలో ఏం ముంచుకువచ్చింది," అన్నాడు గోపాలం పరిస్థితి అర్థంకాక.

"నాన్నగారికి ఇష్టమే. మీరు ఆయన కోరినంత కట్నం ఇస్తామంటే ఆయన కేమీ అభ్యంతరం లేదు. అభ్యంతరం నాదే... నాకే ఇష్టం లేదు. నేను మేనరికమే చేసుకోవాలని అనుకుంటున్నాను. ఆ అమ్మాయిని తప్ప ఇంకేవర్నీ చేసుకో దల్చుకోలేదు. వాళ్ళు పేదవాళ్ళు. పెళ్ళి కూడా చెయ్యలేని స్థితిలో వున్నారు. నాన్నగారికి ఇష్టంలేదు. ఆయన సంగతి మీకు తెలిసిందేగదా...ఆయనకు

డబ్బు ప్రధానం. దయవుంచి అడ్డు రాకుండా వుంటే కొన్నాళ్ళవరకూ నా మీద వత్తిడి తగ్గుతుంది," అన్నాడు రాజు.

శకుంతలకు కలలు అలలుగా విరిగి పోయినట్టయింది. ఇది ఎన్నాళ్ళనించో పెంచుకున్న ఆశ! ఆ విరిగిపోయినకలలు ఆమెను అక్కడ స్థిమితంగా నిలవనివ్వ లేదు పెరటిలోకివెళ్ళిపోయింది ఆమెకళ్ళ చెమ్మగిల్లాయి. పైటచెరగుతో కళ్ళు వత్తుకుంది. ఏమీ ఆలోచించకుండానే, అపేక్షించకుండానే ఉత్తరాల మనిషిని మనస్సులో నింపుకుంది. కేవలం వర్త మానాలు అందించే ఆకర్షణకు, వయస్సు అందం జోడయి ఆ విత్తు అన్నయ్య ఈ సంబంధం గురించి తన మనస్సులోమాట ఎవరో చెప్పినట్టుగా అమ్మతో ప్రస్తా వించినప్పుడు అది మొలకెత్తి చివురు తొడిగింది. అన్నయ్య వాళ్ళు కోరిన కట్నం ఇవ్వటానికి సిద్ధపడ్డప్పుడు ఆ చెట్టు విరగబూసి తన మనస్సు పరవశిం చింది. ఆ పూత పండుతుందని అను కోవటంలో ఆమె కేమీ అపశ్రుతి తోచ లేదు.

"ఇక వస్తాను. ఏమీ అనుకోకండి," అని రాజు వెళ్లిపోయాడు. ఆ సైకిలు బెల్లు దూరంగా వినబడింది.

అమ్మ నిస్పృహగా నిట్టూర్చింది. గోపాలం, "ఇదిపోతే పోనీ, మరో సంబంధం చూద్దాం. మావయ్యకు ఇంకో ఉత్తరం రాస్తాను," అంటున్నాడు.

ఆ తర్వాత తల్లి, అన్నయ్యా ఆ తండ్రి మనస్తత్వం గురించీ అతని ధన దాహం గురించీ చెప్పుకున్నారు.

ఇంతకు ముందు నిర్లిప్తంగా. నలుగురితో బాటే ఎన్నో సంబంధాలు చూసింది. ఏ ఒక్కరూ ఆమె అంత ర్యంలోకి ప్రవేశించలేదు. అందులో ఏ ఒక్కటి ఫలించినా ఆమె ఊహలు, అనుభవాలు ఎలావుండేవో!... ఈ జీవితం ఎలా వుండేదో. ఈ ఉత్తరాల మనిషి మాత్రం తన మనస్సులో విరగ బూసిన చెట్టులా అల్లుకుపోయాడు. ఆ తర్వాత తప్పిపోయిన సంబంధాల తాలూకు వర్తమానం అతనే మోసు కొచ్చాడు చాలాసార్లు. అత నల్లాంటి వర్తమానాలే తేవాలని అనిపించేది. ఇంకోలా జరగకూడదని, అతని చేతుల మీదుగా 'నువ్వు ఇంకొకరి సొత్తువి కాబోతావు, అనే వార్త అందివ్వకూడదని అనిపించేది. ఇంటింటికి తిరిగి ఇంటింటా అభిమానపాత్రుడై ఆశల హరివిల్లయి ఆకర్షింపబడిన ఈ రాజు తన స్వచ్ఛ మయిన మనస్సులో తియ్యని ఊహలు కదిపిన ఈ రంగుల యువకుడు, తన నుంచి దూరంగా వెళ్ళిపోయాడు. ఎందరి ఆశలో ఎందరి సంతోషాలో మూర్తి భవించిన తానై అతని ఎదుట నిలవాలని అనిపించి ప్రతిరోజూ అతనికోసరం

గుమ్మంలో ఎర్రగన్నేరు నీడని నిలబడి పోయేది.

కాని ఇవాళ ఆతని నోటిమీదుగానే అందుకు విరుద్ధమైన మాటలు వింది.

ఇప్పుడలా ఊహించటంకాని, ఆశించటంగాని అర్థంలేని పనిగా అని పించింది శకుంతలకు. ఆమె ఇప్పుడు ఆ కలలనించి ఆ విరుపులనించి తేరు కుంది. ఆ మరదలికి ఇతగానిమీద అభిమానం, ఇతనికి ఆమెమీద ప్రేమాతిశయం! ఈ వస్తువు తనదికాదు. పద్మజ గుర్తుకు వచ్చింది.

ఆ మర్నాడు వీధిలో సైకిలుబెల్లు మోగినప్పుడు వీధినిపోయే బాటసారిగానే అనిపించింది. అతనలాగే ఇటువైపయినా చూడకుండా సైకిలు తొక్కుకుంటూనే వెళ్ళిపోయాడు. పక్క గుమ్మంలో నిలబడి పిలుస్తున్నాడు 'ఉత్తరం' అంటూ. ఆ పిలుపు కొంతసేపు ఆ చుట్టుపక్కలే వినిపించింది.

ఓనాడు మధ్యాహ్నం పంచలో కూర్చుని శకుంతల పద్మతో కబుర్లు చెబుతూంది.

శకుంతల వున్నట్టుండి ఒళ్లో పడిన ఉత్తరంతో తలెత్తి చూసింది.

రాజు ఉత్తరంవిసిరేసి గుమ్మం దాటు తున్నాడు.

"ఏదో పసందయిన వార్త వచ్చి వుంటుందేవ్. చింపు...చింపు..."

"ఏమిటే నీ వేళాకోళం? అన్నయ్యకు వచ్చిన ఉత్తరం. ఎక్కణ్ణించో"

"నేను చెబుతున్నా విను. అది నీ గురించి వచ్చిన ఉత్తరం," అంది పద్మ.

కవరు ఓ మూల మావయ్య పేరు నామా చూసింది శకుంతల.

పక్కింటినించి రాజు పిలుపు విని పించింది.

ఇంతలో తల్లి ఇవతలకు వచ్చి "ఏవిటే" అంది.

"మావయ్య దగ్గర్నించి ఉత్తరం వచ్చింది."

"ఫర్వాలేదు. చింపి చదువు" అంది తల్లి.

"చదువు... చదువు..." అంటూ తొందర చేసింది పద్మ.

"ఏవిటే నీ తొందర. ఆ తర్వాత దెప్పటానికా," అని శకుంతల కవరు చింపి ఉత్తరం పద్మమీదకు విసిరి "నువ్వే చదువు" అంది.

చి॥ గోపాలరావుని ఆశీర్వదించి వ్రాయునది...

ఇక్కడో సంబంధం చూసాను. పిల్లవాడు రూపసి. ఉద్యోగం రైల్వేలో. ఫర్వాలేదు... చేతిలో పనితనం ఉన్న వర్కర్. పెద్దగా ఆస్తిపాస్తులేవీ లేవు. ముందు ముందు పైకి వస్తాడు.

మాట్లాడాను. పిల్లని చూడ్డానికి వస్తా మన్నారు. వచ్చే ఆదివారంనాడు వస్తా.

పద్మ ఉత్తరం చదివి 'నే చెప్పాలా' అంటూ శకుంతల భుజాలు పట్టుకుని అటూ ఇటూ ఊపేసింది.

శకుంతల తలవంచుకుని నేలమీద సున్నాలు చుడుతూంది.

"ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది చూడండి. శకుంతల ఝుమ్మంటూ రైల్లో దేశమంతా తిరిగొస్తుంది," అంది పద్మ.

అనుకున్నట్టే ఆ వచ్చే ఆదివారం నాడు వాళ్లు వచ్చారు. పెళ్ళిచూపులయాయి. పిల్ల నచ్చిందన్నారు. అన్నిటికి ఒప్పందలయింది. ముహూర్తం కూడా పెట్టించి అవతల వాళ్ళ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. ఇక పెళ్ళి నెలరోజులుంది.

ఓనాడు శకుంతల మంచంమీద పడుకుని పుస్తకం చదువుకుంటూంది. తల్లి గుమ్మంలో ఎవరితోనో మాట్లాడుతూంది.

"ఏం నాయనా ఆ అమ్మాయిని పెళ్లి చేసుకున్నావా?"

"లేదండి. నాన్నను నేను తిప్పుకునే ప్రయత్నంలోనే ఆమెకు మరో సంబధం చూసారు. ముహూర్తాలు పెట్టుకున్నారు. తొందర పడ్డారు," అంటూంది అవతల గొంతు.

పుస్తకం పక్కన పడేసి ఇవతలకు వచ్చింది శకుంతల.

రాజు గుమ్మందగ్గర తల్లితో మాట్లాడుతున్నాడు.

"అయ్యో' పాపం' ఎంతో మనసు పడ్డావు" అంది తల్లి సానుభూతిగా.

మనసు పడ్డవన్నీ లభిస్తే ఇది జీవితమే కాదు. ఇంకేదో అనిపించింది శకుంతలకు. ఒకనాడు శూన్యంలోంచి అభిమానం అనే చిన్నవిత్తు పువ్వుల వృక్షంగా తన శరీరమంతా పరుచుకున్న అనుభవం మనస్సులో మెదిలింది. మోడయిపోయిన ఈ చెట్టు మళ్ళీ చివుళ్ళు తొడిగింది పువ్వులు పూస్తుంది కాయలు కాస్తుంది. పూసిన ఆ చెట్టు కాయకుండానే మోడయిపోయింది. మళ్ళీ ఆ చెట్టు చిగురుస్తుంది. పువ్వులు పూస్తుంది. తప్పదు... ఇది ప్రకృతి.

అయినా ఆమె కేవిటో వెలితిగానే అనిపించింది.

ఆ చుట్టుపక్కలనించి రాజుగొంతు 'ఉత్తరం' అంటూ పదే పదే వినిపిస్తూనే వుంది.

పుస్తకం గుండెలమీద పర్చుకుని కళ్ళుమూసుకుంది శకుంతల.